వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరిస్తున్నట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ. రాములు తెలిపారు. బీబీఏ (ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 13వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 13వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో 15వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు.

పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ప్రొ. రాములు తెలిపారు. బీబీఏ (ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 15వ తేదీ నుంచి, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి, మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్, హెచ్ఐ) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి, ఎంబీఏ (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్స్) మొదటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 1వ తేదీ నుంచి, బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎంపీఈడీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రొ. రాములు పేర్కొన్నారు. ఎంపీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఫలితాలను, మిగతా సంబంధిత వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

రద్దైన డిప్యూటేషన్లపై రాద్ధాంతం

- తలలు పట్టుకుంటున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): వైద్య, ఆరోగ్య శాఖలో ఇటీవల రద్దయిన డిప్యూటేషన్లపై రాద్ధాంతం నెలకొంది. ప్రధానంగా జిల్లా అంతర్గత డిప్యూటేషన్లను సైతం రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆరోగ్య శాఖలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. డిప్యూటేషన్ల వల్ల దాదాపు అన్ని జిల్లాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు నిలిచిపోయే పరిస్థితి నెలకొందని జిల్లా వైద్యాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో అవసరమైన చోట డిప్యూటేషన్లను కొనసాగిస్తూ, అనవసరమైన చోట రద్దు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనిని అదునుగా చేసుకుని కొంత మంది సిబ్బంది తమ అనుకూల ప్రాంతాల్లో డిప్యూటేషన్లు వేయించుకునేందుకు, ఉన్న చోటనే కొనసాగేందుకు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఇదో రకమైన తతంగమైతే.. డిప్యూటేషన్లపై ఇచ్చిన వెసులుబాటును ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు సైతం వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకునే క్రమంలో వసూళ్కు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలో సుమారు 800 మందికి పైగా వివిధ హోదాల్లోని సిబ్బంది డిప్యూటేషన్లలపై విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత మంది సిబ్బందిని అవసరం మేరకు ఆయా ఆరోగ్య కేంద్రాల్లో డిప్యూటేషన్లపై నియమించగా, మరికొంత మంది మాత్రం వారి స్వప్రయోజనాల కోసం డిప్యూటేషన్ వేయించుకున్నట్లు సమాచారం. అయితే, స్వప్రయోజనాల కోసం అవసరం లేకున్నా డిప్యూటేషన్ వేయించుకున్న వారిపైననే అధికారులు దృష్టి పెడుతున్నట్లు సమాచారం.

అటవీ భూములు ఆక్రమించకుండా..

పరి రక్షణకు గొలుసు లింక్ ఫెన్సింగ్.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అనేక ప్రతిపాదనలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లి అటవీశాఖ భూమిలో ఏర్పాటు చేసిన ఉద్యానవన అర్బన్ పార్క్

మేడ్చల్, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): అటవీ భూములు దురాక్రమణకు గురి కాకుండా అటవీ శాఖ అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. అటవీ భూముల పరి రక్షణలో గొలుసు లింక్ ఫెన్సింగ్ ఏర్పాటుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 8393.38 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ శాఖకు చెందిన భూమి ఉంది. అటవీ భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పకడ్బందీగా పూనుకుంది. ఇందుకు అనేక ప్రతిపాదనలు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే గొలుసు లింక్ ఫెన్సింగ్ పనులను ప్రారంభించంగా, ప్రస్తుతం అవి పురోగతిలో ఉన్నాయి. అటవీ భూములలో 40 ఫారెస్ట్ బ్లాక్‌లు ఉండగా, 25 కస్టర్లను ఏర్పాటు చేశారు. అయితే, 3660.00 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన 13 ఫారెస్ట్ బ్లాకులలో నీలగిరి ప్లాంటేషన్లు టీఎస్ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ఉన్నాయి. మిగిలిన 4800 హెక్టార్లలో 4 అటవీ బ్లాకులైన మేడిపల్లి, దూలపల్లి, కండ్లకోయ, నారాపల్లి, నాగారం అటవీ శాఖల ద్వారా పట్టణ ఉద్యాన వనాలుగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అటవీ భూములు అధిక విస్తీర్ణంలో ఉన్న నేపథ్యంలో భూముల రక్షణకు బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని ఉద్యాన వనాలుగా తీర్చిదిద్ది కాపాడే చర్యలు చేపట్టింది. ఉద్యాన వనాల ఏర్పాటుతో భూమి చుట్టూ గొలుసు లింక్ ఫెన్సింగ్‌కు ప్రతిపాదించి చర్యలు చేపట్టింది.

వేలాది ఎకరాలలో అర్బన్ పార్కులు

అటవీ శాఖకు చెందిన వేలాది ఎకరాలలో ఉద్యాన వనాలను ఏర్పాటు చేసేందుకు అనేక నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం వెచ్చించింది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో హైదరబాద్ మహా నగరంలో నివసించే ప్రజలకు ఆహ్లాదమైన వాతావారణం అందించేలా 15 అర్బన్ పార్కులను ఏర్పాటు చేసింది. దీనిని అటవీ శాఖ అర్బన్ పార్క్‌ల నిర్వహణతో పచ్చదనం పెంచే విధంగా చర్యలు తీసుకుంటుంది. ప్రతి ఏడాది హరితహారం కార్యక్రమంలో ఎండిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటి అర్బన్ పార్క్‌లలో పచ్చదనం మరింత పెంచుతూ వచ్చారు. హైదరాబాద్ సమీపంలో ఉన్న శివారు ప్రాంతాల భూముల ధరలు అమాంతం పెరగడంతో అటవీ భూములు ఆక్రమణలకు గురికాకుండా గొలుసు లింక్ ఫెన్సింగ్ ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

వర్సిటీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న వీసీ కట్టా నర్సింహారెడ్డి

వ్యాపార రంగంలో విస్తృత అవకాశాలు

- జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10: వ్యాపార రంగంలో విస్తృత అవకాశాలున్నాయని, మారుతున్న సమాజంలో ప్రజల నాడికి అనుగుణంగా ముందుకు సాగితే విజయం సాధించవచ్చని వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. జేఎన్టీయూహెచ్ సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో డైరెక్టర్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు సదస్సుకు వీసీ కట్టా నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. వ్యాపార రంగంలో నేడు అనేక మార్పులు వచ్చాయని వినియోగదారుడు డబ్బుకు తగ్గ వస్తువు దొరికినప్పుడు తృప్తిపడి తానే మౌత్ పబ్లిసిటీ చేసే పరిస్థితి నేడు మార్కెట్‌లో ఉందన్నారు. నాడు శాంత బయోటెక్ సంస్థ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న తర్వాతే ప్రపంచానికి వ్యాక్సిన్‌ను అందించే స్థాయికి ఎదిగిందన్నారు. ఆలివ్ సంస్థ కొత్తగా వ్యాపారం చేసేవారికి శిక్షణనివ్వడం అభినందనీయమని మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో, వ్యవసాయ రంగంలో శిక్షణను ఇస్తుందని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, ఆలివ్ సంస్థ ఉపాధ్యక్షులు జ్యోతి, డైరెక్టర్ ఆర్.శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్, బ్యాంకు మేనేజర్లు, చిన్నతరహా పరిశ్రమల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి శ్రీపాద నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న జైగౌడ్ ఉద్యమం నాయకులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు పాపన్న పేరు పెట్టండి

- వట్టికూటి రామారావు గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 10: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్‌ను జై గౌడ్ ఉద్యమం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం, రామారావు గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి పాపన్న మహారాజ్ యూనివర్సిటీగా నామకరణం చేయాలన్నారు. యూజీసీ ఆధ్వర్యంలో ఓయూలో పాపన్న మహారాజ్ అకాడమిక్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాపన్న చరిత్రను కేంద్ర ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఔరంగజేబు మార్గ్‌ను తొలగించి, పాపన్న మహారాజ్ మార్గ్‌గా చేయాలన్నారు. పాపన్న కోటలను కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పరిరక్షించాలని, ఢిల్లీలో పాపన్న పేరుతో స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. పోస్టల్ ఎన్వలప్ కాకుండా పోస్టల్ స్టాంప్‌పై పాపన్న ఫొటో ముద్రించాలన్నారు. దేశానికి అందించిన సేవలకు గుర్తుగా మరణానంతరం ఇచ్చే భారతరత్నను పాపన్నకు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి తమ డిమాండ్లను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. జై గౌడ్ ఉద్యమం ఏపీ అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిశోర్ గౌడ్, జాతీయ కోఆర్డినేటర్ రాజా నాడార్ పాల్గొన్నారు.

సదస్సు సావనీర్‌ను విడుదల చేస్తున్న ప్రొ. డి.నరసింహారెడ్డి తదితరులు

వ్యవసాయంలో సంక్షోభం.. ఆందోళనకరం

మానవ అభివృద్ధి సంస్థ అధ్యాపకులు ప్రొ.డి.నరసింహారెడ్డి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 10: వ్యవసాయ రంగంలో సంక్షోభం రావడం ఆందోళనకరమని న్యూఢిల్లీలోని మానవ అభివృద్ధి సంస్థ అధ్యాపకులు ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో వ్యవసాయ సంక్షోభం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని, దీని వల్ల తీవ్రమైన ఆహార కొరత ఎదుర్కోబోతున్నామని నరసింహారెడ్డి అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్, ఐసీఎస్ఎస్ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును వర్సిటీ ఆవరణలో శనివారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో 'సంక్షేమ పథకాల అమలు-మూల్యాంకనం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులలో భాగంగా దేశీయ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొ.సీహెచ్ హనుమంతరావును సత్కరించారు. మహేంద్ర దేవ్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలు మహిళా సాధికారతకు నిదర్శనం

భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి చరణ్‌జిత్ సింగ్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 10: స్వయం సహాయక సంఘాలు మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలుస్తున్నాయని భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి చరణ్‌జిత్ సింగ్ పేర్కొన్నారు. పతంజలి శిక్షణా కేంద్రమైన సమృద్ధ్ గ్రామ్‌లో ఉత్తరాఖండ్ లైవ్లీహుడ్ మిషన్ సహకారంతో బేకరీ ఉత్పత్తులు, పరిశ్రమల ప్రోత్సాహంపై చేపడుతున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని యూకేఎస్ఆర్ఎల్ఎమ్ సీఈఓ ఆనంద్ స్వరూప్‌తో కలిసి శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చరణ్‌జిత్‌సింగ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఆశయాలకు అనుగుణంగా స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధి మెరుగుదలకు పతంజలి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. స్వయం సంఘాల మహిళలకు బిస్కెట్లు, బ్రెడ్, కేకుల తయారీలో శిక్షణతో పాటు వాటి బ్రాండింగ్, ప్యాకేజింగ్, లేబులింగ్, మార్కెటింగ్ సహా 'బీ పీఓఎప్ ఈఆర్‌పీ' లో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు పతంజలి సహ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆచార్య బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పతంజలి గ్రామోద్యోగ్, ఫుడ్ పార్క్, పతంజలి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లను సందర్శించారు. కార్యక్రమంలో పతంజలి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై రెండు రోజుల శిక్షణ శిబిరం

'సీపీఆర్' చేసి చూపిస్తున్న అమెరికాకు చెందిన డాక్టర్ రాజశేఖర్, తదితరులు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 10: సీపీఆర్ ఎలా చేయాలో? ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటే అంబంబులెన్స్ వచ్చేలోపు గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణం కాపాడవచ్చని గాంధీ వైద్య కళాశాల అలూమ్ని అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఏఆర్. వెంకటరత్నం అన్నారు. సికింద్రాబాద్‌లోని గాంధీ అలూమ్ని భవనంలో గాంధీ వైద్య కళాశాల అలూమ్ని అసోసియేషన్, గ్లోబల్ అలయెన్స్, జనహిత స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బేసిక్ లైఫ్ సపోర్ట్ అని పిలిచే కార్డియో పల్మనరీ రెసిస్టేషన్ (సీపీఆర్) పై రెండురోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ, అవగాహన శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో రెండురోజుల పాటు పోలీసులు, నర్సింగ్ విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, జనహిత వాలంటీర్లకు కలిపి 4100 మందికి ఉచిత శిక్షణ ఇచ్చామని వారు తెలిపారు. డాక్టర్ రాజశేఖర్ కొల్లిపర (అమెరికా) మాట్లాడుతూ, మన కళ్ళెదుట ఎవరికైనా గుండెపోటుకి గురైతే, వెంటనే బాధితుడికి సీపీఆర్ విధానం ద్వారా ఛాతిపై రెండు చేతులు బిగించి 120 సార్లు 5 సెంటిమీటర్లు ఆగకుండా నొక్కడం వలన గుండె తిరిగి కొట్టుకోవడం, మెదడుకు ఆక్సిజన్ అందడం జరుగుతుందన్నారు. 25 ఏండ్లుగా తాము వైద్యులు, విద్యార్థులు, నర్సులకు సీపీఆర్‌పై ఉచిత శిక్షణ అందిస్తున్నామని అన్నారు.

సింగరేణి పీఆర్వో శ్రీకాంత్‌కు డాక్టరేట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ ప్రజా సంబంధాల అధికారి శ్రీరాముల శ్రీకాంత్ నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'రోల్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ సోషల్ అండ్ పొలిటికల్ మూమెంట్స్ - ఏ కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ మూవ్‌మెంట్' అన్న అంశంపై ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ డా. రాజారాం పర్యవేక్షణలో శ్రీకాంత్ పరిశోధన చేశారు. సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో సోషల్ మీడియా బలమైన పాత్రను పోషిస్తుందని, ప్రధానంగా 'తెలంగాణ ఉద్యమంలోనూ సోషల్ మీడియా పాత్ర' అధికంగా ఉందన్న విషయాన్ని తన పరిశోధన పత్రంలో సమర్పించారు. ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఉస్మానియా వర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. టీ. సతీష్ వైవా వాయిస్ నిర్వహించి డాక్టరేట్ ప్రదానం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకాంత్ పలు కోర్సుల్లో పీజీలు పూర్తి చేయగా, యూజీసీ నెట్ ద్వారా లెక్చరర్‌షిప్‌నకు క్వాలిఫై అయ్యారు. అదే విధంగా పలు ప్రధాన పత్రికల్లో ఏడేళ్ల పాటు సబ్ ఎడిటర్‌గా, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో హైదరాబాద్‌లో జూనియర్ గ్రేడ్ ఐఐఎస్ అధికారిగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో చీఫ్ ప్రజా సంబంధాల అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా జర్నలిజంలో డాక్టరేట్ అందుకోవడంపై జీఎం, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి ఎం.సురేష్ అభినందనలు తెలిపారు. ప్రజా సంబంధాలను మరింత మెరుగుపరచడంలో తన పరిశోధన అనుభవాన్ని సింగరేణిలో వినియోగించాలని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న చేనేత సంత

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): హ్యాండ్లూమ్ వీవర్స్‌ను ప్రోత్సహించడంలో భాగంగా అమీర్‌పేటలోని నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో 54వ చేనేత సంత కొలువుదీరింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విభిన్న రకాల వస్త్ర డిజైన్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. కర్ణాటక, బెంగాల్, ఒడిషా, బెనారస్, చందేరీ, గద్వాల్, పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, సిద్దిపేట్, నారాయణ్‌పేట్, చీరాల, ఖాదీ తదితర వెరైటీ వస్త్ర ఉత్పత్తులు కొలువుదీరాయి. కాగా, ఆదివారంతో ఈ చేనేత సంత ముగియనుంది.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే ఐలయ్య

18న కొమురయ్య ఆత్మగౌరవ భవనం ప్రారంభం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరుతో కోకాపేటలో నిర్మించిన కురుమ కులస్తుల ఆత్మగౌరవ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 18న ప్రారంభిస్తున్నట్లు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం అధ్యక్షతన జరిగింది. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఐలయ్య మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆత్మగౌరవ భవనానికి పదికరాల స్థలం, రూ.10 కోట్ల నిధులు కేటాయించారని, దీనికి సంబంధించి నేడు నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇందులో రాష్ట్ర నలుమూలల నుంచి హైదరాబాదకు వచ్చే విద్యార్థులకు కోచింగ్ కేంద్రంగా ఉంటుందన్నారు. పేద, బలహీన వర్గాలను ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిద్దే భవనంగా నిలుస్తున్నదన్నారు. ప్రారంభోత్సవానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కమిషనర్‌కు వినతి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్‌ను శనివారం ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు కలిశారు. ప్రొటోకాల్‌తో పాటు డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలంటూ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఈ సందర్భంగా రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



బర్డ్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా రవీందర్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 10: నాబార్డ్ ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (బర్డ్) గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా నామినేట్ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, రవీందర్ రావు గతంలో నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబర్‌గా కూడా సేవలందించారు. గ్రామీణ బ్యాంకింగ్ సెక్టార్ అభివృద్ధికి ఆయన కృషి చేసినట్లు వెల్లడించారు.

జూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): కోవె ఆధ్వర్యంలో జూట్, పేపర్ ఉత్పత్తుల తయారీలో మహిళలకు ఉచితంగా శిక్షణ కార్యక్రమం జరగనుంది. స్కిల్ ట్రెయినింగ్ ప్రోగ్రాంలో భాగంగా కొత్తపేటలోని వాగ్దేవి విజ్ఞాన్ కేంద్రంలో నెల రోజుల పాటు నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందేలా ఈ శిక్షణ ఉపయోగపడనుందని నిర్వాహకులు తెలిపారు. కనీస విద్యార్హత ఎనిమిదో తరగతిగా నిర్ణయించారు. 18-35 ఏండ్ల మధ్య ఉన్నవారికి ప్రాధాన్యత నిస్తామని తెలిపారు. ఆసక్తి గల పురుషులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం. 9493703344, 8686880868లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

గ్రేటర్ @ 32.3 డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. నాలుగు రోజుల క్రితం 36 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతూ శనివారం నాటికి సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 32.3 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 21.4 డిగ్రీలు, గాలిలో తేమ 50 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.